క్లుప్తంగా

ఏడీసీగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏడీసీ కేటీ సుధాకర్

కాకినాడ: స్థానిక నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా కేటీ సుధాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు ఏడీసీగా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో కాకినాడ నగరపాలక సంస్థ కార్యదర్శిగా కూడా పని చేసిన అనుభవంతో ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ భావనను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్పొరేషన్‌కు చెందిన వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు ఏడీసీ సుధాకర్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు.

14న సర్పవరం జంక్షన్‌లో జాబ్‌మేళా

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో ప్రధాన మంత్రి కౌశల్ కేంద్ర(పీఎంకేకే) సెంటరులో ఈనెల 14న హీరో మోటోకార్ప్ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు వీఎస్ఎల్ ప్లేస్‌మెంట్స్ డైరెక్టరు బి.వంశీ తెలియజేశారు. జాబ్ మేళాలో హీరో మోటో కార్ప్‌తోపాటు డైకిన్, వింగ్ టెక్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, టెన్త్, ఇంటర్ విద్యార్హతతో 34 ఏళ్ల లోపు యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని సోమవారం ఆయన కోరారు. అసెంబ్లింగ్, మిషిన్ ప్రొడక్షన్, క్వాలిటీ ఆపరేటర్ పోస్టులకు రూ.14 వేలు నుంచి రూ.21 వేలు వరకు జీతం ఉంటుందన్నారు. వివరాలకు సెల్ నంబరు 96665 62358కు సంప్రదించాలని కోరారు.

మహిళలకు టైలరింగ్ శిక్షణ

బోట్‌క్లబ్: విడోస్‌హోం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్టు విడోస్‌హోం చైర్మన్ పైడా రామకృష్ణారావు సోమవారం విలేకరులకు తెలిపారు. స్థానిక దేవాలయంవీధిలోని పెద్దశివాలయం ఎదురుగా ఉన్న బచ్చు రామేశంసత్రం ఆవరణలో ఈ శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకూ, సాయంత్రం రెండు గంటల నుంచి 5 గంటల వరకూ రెండు బ్యాచ్‌లుగా ఈ శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. మూడు నెలల పాటు ఈ శిక్షణ ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టుమెషీన్ కూడా అందిస్తామన్నారు. మరెన్ని వివరాలకు 9182118499 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

16న అరుణాచలానికి స్పెషల్ బస్సు

కాకినాడ: కాకినాడ నుంచి అరుణాచలం వెళ్లేందుకు ఈ నెల 16వ తేదీన స్పెషల్ బస్సు నడుపుతున్నట్టు కాకినాడ డిపో మేనేజర్ యూవీ మనోహర్ తెలిపారు. ఈ బస్సు కాకినాడలో 16న మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి కాణిపాకం, శ్రీపురం, దర్శనం అనంతరం అరుణాచలం వెళ్లి అక్కడ గిరిప్రదక్షిణ పూర్తయిన తరువాత పెద్ద కంచి, కాళహస్తి దర్శనం అనంతరం 19వ తేదీ రాత్రి 10 గంటలకు కాకినాడ చేరుకుంటుందన్నారు. ఈ బస్సుకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు. టికెట్ ధర రూ.3100 నిర్ణయించామన్నారు. టికెట్ బుకింగ్ కోసం మొబైల్ నెంబర్లు 73829 10869, 73829 10778ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వారికి జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన ఒకరికి జైలు, ఆరుగురికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే కాకినాడ ట్రాఫిక్-1 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. అదుపులోకి తీసుకున్నవారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా ఒక్కరికి రెండు రోజులు జైలు, 6 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

కాకినాడ సిటీ: ఏలేరు జలాశయం నుంచి విడుదల చేస్తున్న నీటి ప్రవాహం ఈ రాత్రికి (సోమవారం) ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి కోరారు. ఈ విషయాన్ని సోమవారం రాత్రి ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఏలేరు రిజర్వాయర్ సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.23 టీఎంసీలు రిజర్వాయర్‌లో ఉందని, పై నుంచి 46,405 క్యూసెక్కుల నీరు రాగా 25,275 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు తెలిపారు. తద్వారా పల్లపు ప్రాంతాలలోకి నీరు ప్రవహించే అవకాశం ఉన్నందున ముందుగా ప్రజలు అప్రమత్తంగా ఉండి పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా వెంటనే సంబంధిత తహసీల్దార్లకు సమాచారం అందించాలన్నారు.

అన్నదాతకు ఏలేరు గండం

- ఏలేరు ప్రాజెక్టు నుంచి భారీగా నీటి విడుదల
- ముంపు బారిన పడనున్న గ్రామాలు, వరి చేలు
- అప్రమత్తమవుతున్న కాకినాడ రూరల్ అధికారులు, సిబ్బంది



పండూరులో ముంపునకు గురైన వరిచేలో రైతుకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి సత్యనారాయణ

కాకినాడ రూరల్: అన్నదాతపై ప్రకృతి కన్నెర్రజేసింది. వరుస తుపాన్లతో భయాందోళనకు గురి చేస్తోంది. అధిక వర్షాలు కారణంగా వరిచేలు దెబ్బతినడంతో అధిక పెట్టుబడులతో సాగుబడి సాగిస్తున్న రైతన్నకు మూలిగే నక్కపై తాటిపండు పడ్డా చందాన.. ఏలేరు గండం పట్టుకోంది. తుపాను ప్రభావంతో ఏలేశ్వరంలోని రిజర్వేజర్‌కు పూర్తి స్థాయిలో నీరు చేరడంతో అధికార యంత్రాంగం నీటిని కిందకు విడిచిపెడుతున్నారు. ఐదు వేల క్యూసెక్కులు మొదలు కొని సుమారు 20వేలు క్యూసెక్కులు వరకు నీటిని అంచెలంచెలుగా పెంచుతూ విడుదల చేయడంతో ప్రాజెక్టు దిగువ ప్రాంతాలు జలమయవుతున్నాయి. ఇప్పుడు ఏలేరు ప్రభావం కాకినాడ రూరల్‌పై చూపనుంది. ప్రాజెక్టుకు నుంచి వచ్చే నీరు కాలువల ద్వారా రూరల్ మండలంలోని పి.వెంకటాపురం, పండూరు, నేమాం, తమ్మవరం, సర్పవరం తిమ్మాపురం, తూరంగి తదితర గ్రామాలపై ప్రభావం చూపనుంది. ఇప్పటికే అధిక వర్షాలకు సుమారు 5 వందల ఎకరాలలో వరిచేలు ముంపునకు గురైనట్టు వ్యవసాయాధికారులు నివేదిక ఇచ్చారు. ఏలేరు వరద నీరు వచ్చి చేరితే ఆయా గ్రామాలలో పంట పొలాలే కాదు తిమ్మాపురం జగనన్న కాలనీ, అవంతినగర్, రమణయ్యపేటలోని బాపన్నదొర కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, జనచైతన్య కాలనీతో పాటు కాకినాడ సిటీలోని మధురానగర్ ముంపులో చిక్కుకోనుంది. గతంలో తుపాన్లకు పడవలపై అవంతినగర్, ఎఫ్‌సీఐ కాలనీలలో ఆహారం సరఫరా చేయవల్సి వచ్చింది. ఏలేరుపై రైతాంగంతో పాటు లోతట్టు ప్రాంత ప్రజలు నిద్రాహారాలు మానుకుని భయం భయంగా గడుపుతున్నారు. మరో వైపు అధిక వర్షాలకు చీడిగ వద్ద కాలువకు గండి పడింది.

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

తుపాను హెచ్చరిక, ఏలేరు జలాలు విడుదల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎంపీడీఓ స్వప్న, తహసీల్దార్ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు ముంపునకు అవకాశం ఉండే ప్రాంతాలలో పర్యటించి, తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

గ్రామాలలో పర్యటించిన ఎమ్మెల్యే నానాజీ

తిమ్మాపురం, సర్పవరం, తదితర గ్రామాలతో పాటు ముంపునకు అవకాశాలు ఉన్న ప్రాంతాలలో ఎమ్మెల్యే పంతం నానాజీ సోమవారం పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు.

గణపతి నగర సంకీర్తన



నగరంలో అష్ట గణపతి నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో స్థానిక భోగి గణపతి పీఠంలో సోమవారం రాత్రి అష్ట గణపతుల నగర సంకీర్తన నిర్వహించారు. పసుపు గణపతిని సన్నాయి మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ మాఘ మాసం నుంచి భాద్రపద వరకూ చతుర్థి ఉపవాసకులు విశేష అర్చనలు చేసి అష్ట గణపతులను ఈ నెల 16న నిమజ్జనం చేయనున్నట్టు తెలిపారు. అదే రోజు అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గణపతి నవ రాత్రి దీక్షలు చేపట్టిన స్వాములు పాల్గొన్నారు.

రామాయణం పఠిస్తే ప్రశాంతమైన జీవనం



సభలో మాట్లాడుతున్న సంస్కృతాంధ్ర పండితుడు గొట్టుముక్కుల వెంకట సత్య నరసింహ శాస్త్రి

బోట్‌క్లబ్: రామాయణం చదవడం, వినడం, పారాయణ చేయడం వల్ల ప్రశాంతమైన జీవనం సాగించవచ్చని సంస్కృతాంధ్ర పండితులు గొట్టుముక్కుల వెంకట సత్య నరసింహ శాస్త్రి అన్నారు. స్థానిక రామారావుపేటలోని వేణుగోపాల సంస్కృత ప్రచార సభ ఏర్పాటు చేసిన గణేశ సాహిత్య ఆరాధన కార్యక్రమానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవనం సాగించిన రాములవారి గాధ నిత్యనూతన పురాతనమైందన్నారు. ప్రముఖ సాహితీవేత్త కాశీబొట్ల సత్య నారాయణ మాట్లాడుతూ గణేశ నవరాత్రుల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రచార సభ ఉపాధ్యక్షుడు సరిపెల్ల శ్రీరామ చంద్ర మూర్తి సంయుక్త కార్యదర్శి చింతపల్లి సుబ్బారావు, సభ్యులు డాక్టర్ ఆకెళ్ల శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి

- 6 నెలల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్
- కలెక్టరేట్ వద్ద యానిమేటర్ల బైఠాయింపు



అక్రమ తొలగింపులు ఆపాలంటూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న యానిమేటర్లు

కాకినాడ సిటీ: యానిమేటర్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఉద్రిక్తతకు దారితీసింది. కలెక్టరేట్ వద్ద టెంట్ వేయడానికి వీలులేదని, ధర్నా కూడా చేయొద్దని పోలీసులు అడ్డుకోవడంతో విధిలేని పరిస్థితుల్లో మూక్కుమ్మడిగా కలెక్టరేట్ ముట్టడికి యానిమేటర్లు ప్రయత్నించి బైఠాయించారు. పోలీసులు అరెస్టులకు సిద్ధ పడి వాహనాలను ఏర్పాటు చేయడంతో వర్షంలోనే రోడ్డుపై కూర్చుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.బేబీరాణి, అధ్యక్షురాలు కందా గంగాభవాని, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న వీవోఏ యానిమేటర్లను తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో కూటమి కార్యకర్తలు నేరుగా రాజకీయ వేధింపులకు పాల్పడుతూ ఉద్యోగాలకు రావద్దని అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు తొలగించిన 200 మంది పైచిలుకు యానిమేటర్లను విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలతో చిరుద్యోగులు సతమతమవుతున్న పరిస్థితుల్లో 6 నెలల నుంచి వేతనాలు చెల్లించకపోతే యానిమేటర్లు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. తక్షణం పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిలదీశారు. కూటమి కార్యకర్తలకు ఉద్యోగాలు ఇవ్వాలి తప్పితే, ఉన్నవాళ్లను తొలగించడం చేతకాని తనానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఎవరిని తొలగించే ఉద్దేశం కూటమి ప్రభుత్వానికి లేదని చేస్తున్న ప్రకటనలకు భిన్నంగా కింది స్థాయి కూటమి నాయకులు అడ్డగోలుగా వ్యవహరిస్తూ అరాచానికి పాల్పడ్డాన్ని ప్రభుత్వ పెద్దలు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీఐటీయూ అనుబంధ సంఘాలను ఏకం చేసి ఉద్యమించాల్సి ఉంటుందని ఆందోళనకారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏరుబండి చంద్రావతి, యానిమేటర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరీభాయి, ఈశ్వరి, అనంత, పద్మ, రాజు, రాజేశ్వరి, నాగమణి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై పిచ్చిమొక్కలు





టూటౌన్ ఫ్లైఓవర్ రక్షణ గోడపై పెరుగుతున్న పిచ్చిమొక్కలు

బీటలు వారుతున్న రక్షణ గోడలు

బోట్‌క్లబ్: వంతెన మీద ప్రయాణించే వారికి రక్షణగా ఉండాల్సిన రక్షణ గోడలు ప్రస్తుతం బీటలు వారుతున్నాయి. టూటౌన్ ఫ్లెక్సైవర్ బ్రిడ్జికి రెండు వైపులా ఉన్న రక్షణ గోడలు ప్రస్తుతం ప్రమాదభరితంగా తయారయ్యాయి. రక్షణ గోడలకు పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో గోడలు బీటలు వారి పెచ్చులుడుతున్నాయి. అధికారులు స్పందించి ఇప్పటికైనా పిచ్చిమొక్కలు తొలగించి, రక్షణగోడలను కాపాడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టిడ్కో గృహాల పరిశీలన



సామర్లకోటలో టిడ్కో ఇళ్ల సముదాయాన్ని పరిశీలించిన ఆర్డీఓ కిషోర్

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులో ఉప్పువారి సత్రం ఎదురుగా ఉన్న టిడ్కో గృహాలను కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. టిడ్కో ఇళ్ల సముదాయంలో 80 సంవత్సరాలు దాటిన వృద్ధులు, గర్భిణులు, పిల్లల వివరాలను సిద్ధం చేయాలని మెప్మా సిబ్బందిని ఆదేశించారు. ఏలేరు కాలువ సమీపంలో టిడ్కో ఇళ్ల సముదాయం ఉండడంలో ఆ ఇళ్లల్లోకి నీరు వచ్చే అవకాశం ఉందనే సమాచారం మేరకు ఆయన ఆ ఇళ్లను పరిశీలించారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో వరద బాధితులకు పునరావాసం ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఏలేరు కాలువ ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, కౌన్సిలర్ బలుసు వాసు, మాజీ కౌన్సిలర్ బడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తాండవ నీటి విడుదలతో నిలిచిన రాకపోకలు



కోటనందూరులో తాండవ పరిస్థితిని పరిశీలిస్తున్న సీఐ చెన్నకేశవరావు

కోటనందూరు: తాండవ జలాశయం నుంచి భారీ స్థాయిలో నదికి నీటిని విడుదల చేస్తుండడంతో మండలంలోని తుని-నర్సీపట్నం రోడ్డు, కోటనందూరు, కాకరాపల్లి-అల్లిపూడి గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. తాండవనది పరివాహక ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డీఈఈ అనురాధ సూచించారు. తాండవ పరివాహక గ్రామాలు, అల్లిపూడి, కోటనందూరులో తాండవ బ్రిడ్జిలను తహసీల్దార్ శుభాష్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్సై రామకృష్ణ పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రజలెవరూ నది ఒడ్డుకు రాకూడదని హెచ్చరించారు. ప్రభుత్వ యంత్రాగాన్ని, పోలీసులను బ్రిడ్జిల వద్ద మోహరించారు.

గణపతికి ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మండలంలో గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు మండపాల వద్ద సాంస్కృతిక కార్యాక్రమాలు ఏర్పాటు చేశారు. స్థానిక పోలమ్మగుమ్మం సెంటర్‌లో లక్ష్మీగణపతి విగ్రహానికి గణేష్ యూత్ ఆధ్వర్యంలో చెరకు గెడలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నూకాలమ్మ హుండీ ఆదాయం రూ.7.65 లక్షలు



నూకాలమ్మ ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ వారి ఆలయానికి హుండీల ద్వారా రూ.7,65,921 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి టీవీ సూర్య నారాయణ తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ్ కుమార్‌బాబు నాయుడు సమక్షంలో సోమవారం ఆలయ హుండీలను లెక్కించారు. 93 రోజుల కాల వ్యవధిలో అమ్మవారి ఆలయానికి రూ.7,65,921ఆదాయం సమకూరిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆసాదులు, సేవాసంఘం మహిళలు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యం



పిల్లలకు మెమెంటోలు అందజేస్తున్న ఎస్సై మౌనిక, నిర్వాహకులు

పెద్దాపురం: స్థానిక మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయకుని గుడి వద్ద గణపతి నవరాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం 40 మంది బాలబాలికలు ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రముఖ కళాకారుడు పాలమరశెట్టి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్సై మౌనిక, మహారాణి సత్రం మాజీ చైర్మన్ కనకాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు మెమెంటోలు అందజేశారు. తొలిత ఎస్సై మౌనికను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సందక శ్రీను, పాలకుర్తి సతీష్, కాపుగంటి కిషోర్ తదితరులు ఉన్నారు.

నర్సుల నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఎన్‌హెచ్‌ఎం నర్సులు

కాకినాడ క్రైం: తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు నర్సులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శిరీష, సెక్రటరీ పి.ఉషారాణి దేవి మాట్లాడుతూ, ఏఎన్ఎంలకు నామమాత్రపు శిక్షణనిస్తూ రెగ్యులర్ కాంట్రాక్టు నర్సులుగా ఉద్యోగాలిస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 15ఏళ్లుగా అరకొర జీతాలతో విధులు నిర్వర్తిస్తున్న తమను కూడా ఎన్‌హెచ్‌ఎం తోపాటు రెగ్యులర్ చేయాలన్నారు. కోవిడ్ సహా విపత్కర వేళల్లో ప్రాణాలకు సైతం లెక్క చేయకుండా రోగులకు సేవలందించామని, అయినా ఉద్యోగ భద్రత లేకుండా అరకొర జీతాలతో నెట్టుకొస్తున్నామన్నారు. తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పూర్తి అర్హత ఉన్న తమను కాదని, నామమాత్రపు శిక్షణనిచ్చి నర్సులుగా నియమించడం రోగుల ప్రాణాలతో చెలగాటమాడడమేనని, తక్షణమే ప్రభుత్వం విడుదల చేసిన తాజా జీవోలు ఉపసంహరించుకొని కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న నర్సులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుత నిరసనలకు స్పందించకపోతే విధుల బహిష్కరణకు వెనుకాడబోమని అన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకూ నిరసన కొనసాగుతుందని తెలిపారు.

ముంపు పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

తొండంగి: కుండపోత వర్షాలకు మండలంలోని నీట మునిగిన వరి పొలాలను వ్యవసాయశాఖ శాస్త్రవేత్తల బృందం సోమవారం పరిశీలించింది. మార్టేరుకు చెందిన వ్యవసాయ పరిశోధనా విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.సుధారాణి, పీవీ రమేష్‌బాబు, కాకినాడ డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ యస్.దయాకర్ తదితర అధికారుల బృందం ఎ.కొత్తపల్లి, కోదాడ, కొమ్మనాపల్లి, ఏవీ నగరం, సీతారాంపురం పరిసర ప్రాంతాలను పరిశీలించింది. 1846 హెక్టార్లలో వరి పంట నీట మునిగినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం, ఏఈఓ కొప్పన దైవప్రసాద్, గ్రామసచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దబ్బ కాలువకు గండి



కాండ్రకోటలో తెగిన దబ్బ కాలువ తాత్కాలిక బ్రిడ్జి



దబ్బ కాలువను పరిశీలిస్తున్న జేసీ మీనా



పెద్దాపురం మండలంలో మునిగిన వరి పంట

- ఏలేరు కాలువ ఉధృతం
- ముంపులో 400 ఎకరాల పంట
- బెంబేలెత్తిపోతున్న రైతన్నలు
- ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన జేసీ రాహుల్ మీనా, ఆర్డీఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: ఏలేరు ప్రాజెక్ట్ నుంచి సుమారు 20వేల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేయడంతో పెద్దాపురం మండలంలోని ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం రాత్రి మండలంలోని కాండ్రకోట దబ్బ కాలువ తాత్కాలిక బ్రిడ్జికి గండి పడడంతో కాండ్రకోట, కట్టమూరు, తూర్పుపాకల, జె.తిమ్మాపురం గ్రామాల రైతుల రాకపోకలు నిలిచిపోయాయి. ఆ గ్రామాలతో పాటు వడ్లమూరు, పులిమేరు తాటిపర్తి గ్రామాల్లో సుమారు 400 ఎకరాల వరి పంటలు, కాలువను ఆనకుని ఉన్న కాలనీలు ముంపునకు గురయ్యాయి. విషయం తెలుసుకున్న పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు స్థానిక తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఇరిగేషన్ ఏఈ వీరబాబు, ఎస్ఐ మౌనికలతో కలిసి గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఆర్డీవో ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది ఏటిపట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా సోమవారం దబ్బకాలువను పరిశీలించారు. పెరుగుతున్న వరద ఉధృతికి ప్రాణ నష్టం వాటిల్లకుండా ప్రజలను సురక్షత ప్రదేశాలకు తరలించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 150 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు జేసీ తెలిపారు. గంటగంటకు పెరుగుతున్న వరద నీటిని దృష్టిలో పెట్టుకుని ఏలేరు కాలవకు ఆనుకుని ఉన్న ఆయా గ్రామాల ప్రజలను సురక్షత ప్రదేశాలకు తరలించేదుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. ఏటిపట్టు గ్రామాల ప్రజలు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సుచించారు.